22

# మూడు కొండలు

హిమాలయ పర్వత ప్రాంతంలో పెద్దలోయ ఒకటి ఉంది.

అందులో ఎత్తైన కొండ మీద చాలా పెద్ద గుహ ఒకటి ఉంది. అందులో ఒక గంధర్వరాజు తనపరివారంతో నివసిస్తుండేవాడు. ఆ గుహలోకి మనుషులెవరూ అడుగుపెట్టేవారు కాదు. ఎవరైనా పెడితే వారిని అంతంచేసేవారు గంధర్వులు.

ఒకసారి గంధర్వరాజుకి చాలా అందమైన పాప పుట్టింది. విచిత్రమేమిటంటే... ఆ అమ్మాయికి అన్నీ మానవ లక్షణాలు ఉన్నాయి. ఆస్థాన జ్యోతిషుడు 'పిల్ల ఆ విధంగా పుట్టడం అరిష్టాన్ని సూచిస్తుందనీ, అందువల్ల ఆ పాపను చంపివేయాలనీ' చెప్పాడు.

అందుకు రాజు మనసు ఒప్పక పోయినా ప్రజలు కూడా ఒత్తిడి చేయడంతో విధిలేక అందుకు ఒప్పుకున్నాడు. ఎంతైనా... రాజుగారి బిడ్డ కాబట్టి–ఆ అమ్మాయిని ఒక అందమైన తొట్టిలో పెట్టి పెద్ద ఊరేగింపుతో తీసుకువెళ్ళి ఆ గుహ దిగువ లోయలో ఉన్న నదిలోకి పడవేశారు. అంతటితో ఆ పాప చనిపోయి పీడ విరుగడ అయిందనుకున్నారు వాళ్ళు.

ఆ పెట్టె అలా అలా కొట్టుకుపోయి, ఎంతో దూరాన నది వంపు తిరిగిన చోట నేలను తాకింది. అక్కడే ఒక రాజు వేసవి మందిరం ఉంది. వేసవి కాలంలో 'నగపాలుడు' అనే ఆ రాజుగారు రాణిగారితో, పరివారంతోను ఆ మందిరంలో గడుపుతుంటాడు.

ఆ సాయంత్రం నది ఒడ్డుకు విహారానికి వచ్చారు రాజుగారు, రాణిగారు. అలా విహరిస్తుంటే వారికి దగ్గరలో ఎక్కడినుండో పసిపాప ఏడుపు వినపడసాగింది.

ఆ దిశగా వెళ్ళి చూసేసరికి.., వారికి ఆ పాప కనిపించింది. పిల్లలు లేని తమకు దేవుడే ఆ పాపని ఇచ్చాడని భావించి ఆ పాపను తీసుకువెళ్ళి అల్లారు ముద్దుగా పెంచుకోసాగారు ఆ దంపతులు. హిమాలయాల్లో దొరికినందువల్ల ఆ పాపకు 'హిమనందిని' అని పేరు పెట్టారు.



హిమనందినికి పదేళ్ళు వచ్చాయి. ఏ విషయంలోనూ ఆ అమ్మాయి మాటకు తిరుగులేదు. అంత గారాబంగా పెరుగుతోంది. ఆ అమ్మాయిని బయటకు తీసుకువెళ్తే ప్రజల దృష్టి ఆ అమ్మాయిపై ఎక్కడ పడుతుందోనన్న భయంతో, రాజభవనం దాటి హిమనందినిని ఎప్పుడూ బయటికి తీసుకువెళ్లలేదు నగపాలుడు.

ఒకసారి నగపాలుడికి తీవ్రమైన అస్వస్థత కలిగింది. రాజమందిరంలో అందరూ ఆ విషయమై హడావుడి పడుతుండసాగారు.

ఆ సమయంలో హిమనందినికి ఏమీ తోచలేదు. ఒక్కతే ఉండడానికి విసుగుపుట్టి నెమ్మదిగా రాజమందిరంలో నుంచి బయటపడింది. బయటి ప్రపంచం ఆ చిన్నారికి ఎంతో అందంగా కనిపించింది.

సీతాకోక చిలుకలు ఎగురుతుంటే... ఆ అమ్మాయికి ఎంతో ముచ్చటవేసింది. వాటిని తరుముకుంటూ సర్వం మరిచిన హిమనందిని దగ్గరలో ఉన్న అడవిలోకి వెళ్లిపోయింది.

చాలాసేపు పరుగెత్తడంతో ఆ అమ్మాయికి అలసట వచ్చి ఒక వెదురు దుబ్బు క్రింద నిద్రపోయింది.

అలా గాఢంగా నిద్రపోతున్న హిమనందినికి ఎవరో ఏడుస్తూ పిలుస్తున్న శబ్దం వినిపించి మెలకువ వచ్చింది. అది ఎవరిదో బాలుని స్వరం!

"నన్ను బయటికి తీయండి... రక్షించండి!" అని దీనంగా అరుస్తున్నాడు ఆ బాలుడు.

ఆ చుట్టు ప్రక్కల కలియజూచినా ఆ స్వరం ఎక్కడినుంచి వస్తుందో ఆ అమ్మాయికి తెలియలేదు.

"ఎవరు నువ్వు? ఎక్కడి నుంచి మాట్లాడుతున్నావు?" అని అడిగింది హిమనందిని.

"నా పేరు జయపాలుడు. కామరూప రాజకుమారుడిని. నన్ను దొంగలు ఈ వెదురు పొదలో బంధించారు. ఈ వెదుళ్ళను నరికి నన్ను బయటకు తీయి" అంది ఆ స్వరం.

పదేళ్ళ చిన్నారి అయిన హిమనందిని వెదుళ్ళనేం నరుకగలదు! 'ఏమి చెయ్యాలా..?' అని ఆలోచిస్తూ ఉండగా అటువైపు ఒక కట్టెలు కొట్టేవాడు వస్తూ కనిపించాడు. వాడిని పిలిచి ఆ వెదుళ్ళు నరికించింది ఆ అమ్మాయి.

వాటిమధ్య నుంచి ఓ పన్నెండేళ్ళ బాలుడు బయటకు వచ్చాడు. ఆ రాజకుమారుని దొంగలు ఎత్తుకు వచ్చి వంటి మీది నగలు దోచుకుని ఆ దుబ్బులో బంధించి వెళ్లిపోయారట!

అప్పటివరకు హిమనందినికి తన ఈడు నేస్తాలెవరూ లేరు. అందువల్ల... ఒంటరితనం అనుభవిస్తూండేది. జయపాలుడు తన ఈడువాడు కావడంతో ఆ అమ్మాయికి ప్రాణం లేచివచ్చినట్లు

అయింది. అతన్ని వెంటబెట్టుకుని తన రాజమందిరం చేరింది. అప్పటికి నగపాలుడికి పూర్తి ఆరోగ్యం చేకూరింది.

మగ పిల్లలు లేని నగపాలునికి, అతని భార్యకి... జయపాలుని చూడగానే ప్రాణంలేచి వచ్చినట్లయింది. అతనిని దేవుడే తమకు ప్రసాదించాడనుకొని, హిమనందినిని చూసినట్లుగానే జయపాలుడిని అల్లారుముద్దుగా పెంచుకొసాగారు.

హిమనందిని, జయపాలుడు ఎంతో స్నేహంగా పెరగసాగారు.

వారికి యుక్త వయస్సు వచ్చింది. వారిద్దరికీ ఒకరి మీద ఒకరికి ఇష్టం ఉంది. అది గమనించి నగపాలుడు వారిద్దరికి వివాహం చేయాలని నిశ్చయించాడు.

పెళ్లి ఏర్పాట్లు ఘనంగా జరుగసాగాయి. ఆకాశమంత పందిరి, భూదేవంత పీటా వేశారు. రకరకాల బట్టలు కుట్టించారు ఇద్దరికీ. ఇరువయినలుగురు వంటవాళ్ళు నవకాయపిండి వంటల భక్ష్యాలు, భోజనాలు చేయసాగారు.

ఆ రోజు హిమనందినిని పెళ్ళికూతుర్ని చేశారు. పెళ్ళికూతురి బట్టలు కట్టేటప్పుడు ఆ అమ్మాయికి ఇష్టమయిన నీలంరంగు దుస్తుల బదులు ఆకుపచ్చనివి తెచ్చారు.

తనకు కావలసిన రంగువి లేకపోవడంతో- ఎన్ని చూపించినా... తోసేసి, కోపంతో కేకలు వేయడం మొదలు పెట్టింది హిమనందిని. ఆ కేకలు విని జయపాలుడు అక్కడికి వచ్చాడు. అంతచిన్న విషయం మీద కోపం తెచ్చుకున్నందుకు ఆమెను మందలించాడు. దాంతో మాటామాటా పెరిగి ఇద్దరూ గొంతెత్తి పోట్లాడుకోసాగారు.

అది తెలిసి నగపాలుడు వచ్చి ఇద్దరి మధ్య నిలబడి తగవు తీర్చబోయాడు. అయినా... ఇద్దరూ వినకపోవడంతో తానూ గట్టిగా అరవసాగాడు.

ఈ అరుపులు గుహలో ఉన్న గంధర్వరాజుకి, ఇతరులకు వినిపించాయి. ఆస్థాన జ్యోతిషుడు అంజనం వేసి చూసి, 'తాము పారవేసిన బిడ్డే... హిమనందిని!' అని గుర్తించాడు. ఆమె ఇంకా బ్రతికి ఉంటే ప్రమాదమని తన మంత్రశక్తితో ఆ ముగ్గుర్నీ మూడు కొండలుగా మార్చేశాడు!

ఇప్పటికీ ఆ ముగ్గురూ మూడు కొండల రూపంలో- రెండు చిన్న కొండల మధ్య ఒక పెద్ద కొండగా ఆ ప్రాంతంలో ఉన్నాయట! హిమాలయ ప్రాంతపు ప్రజలు ఇప్పటికీ ఈ కథను చెప్పుకుంటుంటారు.

★★★